శుభాకాంక్షలు

బీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్‌ను ఆదివారం అంబర్‌పేట కార్పొరేటర్ ఈ.విజయ్‌కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ డివిజన్ అధికార ప్రతినిధి మహేశ్ ముదిరాజ్, నాయకులు సురేశ్, మహేశ్‌గౌడ్, రుద్ర,సంతోష్‌చారి, వినయ్‌తో కలిసి పద్మారావును సన్మానించారు.

– అంబర్‌పేట, మార్చి 24

సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా అధిష్టానం తీగుళ్ల పద్మారావును ప్రకటించిన సందర్భం గా ఆదివారం భోలక్‌పూర్‌కు చెందిన పార్టీ మైనార్టీ సెల్ సీనియర్ నాయకుడు మహ్మద్ ఆరీపోద్దీన్ ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

– కవాడిగూడ, మార్చి 24

నేటి నుంచి రసరంజని నాటకోత్సవాలు

తెలుగు యూనివర్సిటీ, మార్చి 24 : రసరంజని 31వ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్రభారతిలోని ప్రధాన ఆడిటోరియంలో నేటి నుంచి నాటకోత్సవాలు నిర్వహిస్తామని ఆదివారం రసరంజని కార్యదర్శి ముట్నూరి కామేశ్వరరావు తెలిపారు. 25న సాయంత్రం అభ్యుదయ నాటక సమాఖ్య సమర్పణలో తులసి బాలకృష్ణ రచించి, దర్శకత్వం వహించిన నివురు అపరాధ పరిశోధక నాటకం,26న పాండవ ఉద్యోగమ్ పౌరాణిక పద్యనాటకానికి గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వ నిర్వహణ చేసి ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 27న ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆకెళ్ల శివప్రసాద్ రచించిన నచికేత నాటకం ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

• అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, మార్చి 24 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ పరిధిలోని కమలానగర్, న్యూ కమలానగర్ ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ఉచిత సిలిండర్, ఉచిత విద్యుత్, పింఛన్లు సరిగ్గా రావడం లేదని, వీధి లైట్లు వెలుగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, కిషన్‌సింగ్, బక్కయ్య, మహేశ్, రాజు, యాదగిరి, జగన్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



గోల్నాక కమలానగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

శ్రీధాత్రి పురస్కారాల ప్రదానం

పురస్కార గ్రహీతలతో ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి

ముషీరాబాద్, మార్చి 24 : మహిళా దినోత్సవం నేపథ్యంలో ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వివిధ రంగాల మహిళా ప్రముఖులకు శ్రీధాత్రి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి పలువురు జర్నలిస్టులను పురస్కారాలు అందజేశారు. ఆకాంక్ష చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు, అధ్యక్షురాలు పాలపర్తి సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయుడు వల్లీశ్వర్, మోహనకృష్ణ పాల్గొన్నారు.

అసోసియేషన్ వజ్రోత్సవాలు

కార్యక్రమంలో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, మార్చి 24 : గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ వజ్రోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామమూర్తి, బి.సూర్యప్రకాశ్, పిడియాట్రిషియన్ డాక్టర్ ఏవీ మనోహర్‌రావు, ప్రొఫెసర్ డాక్టర్ రత్నశ్రీ, పద్మావతి పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

మెహిదీపట్నం, మార్చి 24 : శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తున్నారని దక్షిణ, పశ్చిమ మండలం అదనపు డీసీపీ అష్వాక్ అహ్మద్ అన్నారు. గోల్కొండ పీఎస్ పరిధిలో అదనపు బలగాలు, గోల్కొండ పోలీసులతో కలిసి అదనపు డీసీపీ అష్వాక్ అహ్మద్, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ పి.సైదులు ఎస్సైలు, సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అదనపు డీసీపీ అష్వాక్ అహ్మద్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నామన్నారు.

కాచిగూడలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఏసీపీ రఘు, సీఐ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్సైలు

గోల్కొండ పీఎస్ పరిధిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న డీసీపీ అష్వాక్ అహ్మద్, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, అదనపు బలగాలు

కాచిగూడ పీఎస్ పరిధిలో..

కాచిగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కాచిగూడ డివిజన్ ఏసీపీ వి.రఘు పిలుపునిచ్చారు. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాచిగూడ పీఎస్ పరిధిలోని కాచిగూడ మౌలానా ఆజాద్‌నగర్, నింబోలిఅడ్డా, కృష్ణానగర్, గోల్నాక వరకు ప్రధాన రోడ్లపై 100 మంది పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు డి.సుభాష్, పి.రవికుమార్, హెచ్.నరేశ్ పాల్గొన్నారు.

తెలంగాణ మాల బ్యాగరి కాటికాపర్ల సంఘం సమావేశం

నాంపల్లి నియోజకవర్గం మెహిదీపట్నం దేవునికుంట శ్మశాన వాటికలో తెలంగాణ మాల బ్యాగరి కాటికాపర్ల సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంఘం జాతీయ అధ్యక్షులు ఎక్తపు కేశవులు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాటికాపర్ల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కాటికాపర్లకు హెల్త్ కార్డులను ఇవ్వాలని తీర్మానించారు. దేవునికుంట శ్మశానవాటికలో సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అధ్యక్షుడు కేశవులు డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఎం.సుదర్శన్, ఎం.నాగరాజు, శ్రీను, సురేంద్ర, వెంకటస్వామి పాల్గొన్నారు.

– అబిడ్స్, మార్చి 24

టోలిచౌకిలో ఇఫ్తార్

టోలిచౌకి ఎండీలైన్స్ శాతంనగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్ పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, మార్చి 24

'ఆయుష్మాన్' ను సద్వినియోగం చేసుకోవాలి



కాచిగూడ,మార్చి 24 : ఆయుష్మాన్ భారత్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారమేశ్‌యాదవ్ కోరారు. ఆదివారం పనితీరును పరిశీలించిన కార్పొరేటర్ తెల్లరేషన్ కార్డు కలిగి, అర్హులైన కుటుంబసభ్యులందరూ రూ. 5 లక్షల వరకు ప్రైవేట్, ప్రభుత్వ దవాఖానల్లో చికిత్స చేయించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో సుభాష్‌పటేల్, మల్లికార్జున్, రమాదేవి, భీంరాజ్, రవియాదవ్, సంతోష్, పద్మజ, ఇందిర, సబిత, రమ, తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ గుప్తాకు అవకాశమివ్వాలి

కే. శ్రీధర్ సాగర్, బీఆర్ఎస్ గుడిమల్కాపూర్ అధ్యక్షుడు

అబిడ్స్, మార్చి 24 : హైదరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా సీనియర్ నాయకుడు సంతోష్ గుప్తాకు అవకాశమివ్వాలని కార్వాన్ నియోజకవర్గం గుడిమల్కాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కోడూరి శ్రీధర్ సాగర్ అన్నారు. పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న సంతోష్ గుప్తాకు అవకాశం ఇస్తే పార్టీలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పాతనగరంలో బీఆర్ఎస్‌కు అన్నివర్గాల మద్దతు ఉందని, సత్తా ఉన్న నాయకుడిని పార్టీ రంగంలోకి దింపాలన్నారు. గోషామహల్ నియోజకవర్గంతోపాటు హైదరాబాద్ ఎంపీ స్థానంలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంతోష్ గుప్తాకు సత్సంబంధాలు ఉన్నాయని హైదరాబాద్ ఎంపీ టికెట్ ఇవ్వాలని కోడూరి శ్రీధర్ సాగర్ అధిష్టానాన్ని కోరారు.

సీపీ బ్రౌన్‌కు ఘన నివాళి

మాట్లాడుతున్న కోలేటి దామోదర్ గుప్తా

ముషీరాబాద్, మార్చి 24: చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా ఆదివారం సాహితీవేత్త సీపీ బ్రౌన్ సంస్మరణ సభ జరిగింది. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా ముఖ్యఅతిథిగా విచ్చేసి సీపీ బ్రౌన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పొత్తూరు సుబ్బారావు, గుదిబండి వెంకట రెడ్డి, శ్రీధర సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'మాల కార్పొరేషన్'ను ఏర్పాటు చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ మాలసంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, తదితరులు

కవాడిగూడ, మార్చి 24 : ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో వెనకబడిన మాలల సంక్షేమానికి ప్రత్యేకంగా 'మాల కార్పొరేషన్' ను ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, వర్కింగ్ చైర్మన్ బేరా బాలకిషన్(బాలన్న) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి బొకే అందజేసి సన్మానించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. మాల సంఘాల జేఏసీ నాయకులు వినోద్ కుమార్, రవి, కనుకరాజ్, సత్యనారాయణ, ప్రభాకర్, రాజు, సుమన్ పాల్గొన్నారు.

మెగా హెల్త్‌క్యాంప్‌నకు విశేష స్పందన

చిక్కడపల్లి, మార్చి 24 : బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో ఆదివారం వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఆర్.వివేక్ ఆధ్వర్యంలో మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. అపోలో,మెడ్‌కేర్ హాస్పిటల్స్ సౌజన్యంతో బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి వెంకట్‌స్వామిగౌడ్, కోశాధికారి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు రాజు, కల్యాణ్‌నాయక్, క్లబ్ సభ్యులు, వాకర్స్ నాగభూషణం, శంకర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ గోల్నాక కోఆర్డినేటర్ల సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు

అంబర్‌పేట, మార్చి 24 : బీజేపీ గోల్నాక డివిజన్ కోఆర్డినేటర్ల సమావేశం ఆదివారం గోల్నాకలో డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు.దీనికి పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్‌బూత్‌లలో చేయవలసిన కార్యక్రమాలు, బూత్ కమిటీల పటిష్టం కోసం సూచనలు చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ఎం.శ్యాంరాజ్, నాయకులు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, కర్రి రవీందర్, ఆర్కే రాంచందర్, సలీం, ఖాజా, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌నాయుడు, శ్రీధర్ గౌడ్, రాజేశ్, ఈశ్వర్‌రావు, జంగయ్య, బాబు, స్వప్నప్రియ, సావిత్రి పాల్గొన్నారు.

రౌడీషీటర్ బైండోవర్..

కాచిగూడ, మార్చి 24: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నింబోలి అడ్డా ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ గణేశ్‌ను బైండోవర్ చేసినట్లు కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. పీఎస్ పరిధిలో పలు కేసుల్లో సంబంధం ఉన్న గణేశ్‌ను బైండోవర్ చేసి ఆర్‌డీఓ ఎదుట హాజరు పరిచినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ఆరెకటికల సమస్యలు పరిష్కరించాలి

కాచిగూడ,మార్చి 24 : ఆరెకటికల సమస్యలు పరిష్కరించాలని, బీసీ – డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని మాజీ ఫ్లోర్‌లీడర్ ఎస్.గోపాల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం నింబోలిఅడ్డా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఆరెకటికలకు ప్రత్యేక ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలని, మహారాష్ట్రలో ఆరెకటికలు ఎస్సీ జాబితాలో కర్ణాటకలో బీసీ–ఏలో ఉన్నారని గుర్తుచేశారు. కాచిగూడ, జియాగూడ, బోయిగూడ, గౌలిపుర కబేళాలపై ఆధారపడి జీవిస్తున్న ఆరెకటికలు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న గజ్జెల రాజశేఖర్ మాదిగ

కవాడిగూడ, మార్చి 24 : 26న బన్సీలాల్‌పేటలోని ముదిరాజ్ భవన్‌లో జరిగే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజక వర్గం ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్ మాదిగ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కవాడిగూడలో డివిజన్ జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో రాజశేఖర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో బస్తీల నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ జాతీయ నాయకులు మంథని సామ్యేల్ మాదిగ, ఎమ్మెఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు జన పాల మహేశ్ మాదిగ, డివిజన్ నాయకుడు ఇల్లందుల ఎల్లయ్య మాదిగ, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయసాధనకు కృషి చేయాలి

భగత్‌సింగ్ యువజన స్మారకోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న సినీనటుడు శివారెడ్డి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 24 : భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో భారత విద్యార్థి ఫెడరేషన్,భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ స్మారక యువజన ఉత్సవాల ముగింపు సభ ఆదివారం జరిగింది. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్‌లేకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. సినీనటుడు శివారెడ్డి మాట్లాడుతూ.. అనవసరపు సోషల్ మీడియా అంశాలపై దృష్టిపెట్టకుండా సమాజంలో అంతరాలు పోవడానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో ఆటలు, సాంస్కృతిక పోటీలు డ్రగ్స్ నివారణపై వ్యాసరచన పోటీలు నిర్వహించి అవగాహన కలిపించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు,జిల్లా కార్యదర్శి కె. అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ. వెంకటేశ్, జిల్లా అధ్యక్షుడు అస్మిబాబు, కార్యదర్శి ఎండీ జావిద్ పాల్గొన్నారు.

బంగారు నంది అవార్డుల బహూకరణ

అవార్డులు స్వీకరిస్తున్న సమాజసేవకులు

రవీంద్రభారతి, మార్చి 24 : వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నారీశక్తి, ఇయర్ ఆఫ్ సోషల్ సర్వీస్ ఐకానిక్, జీసీఎస్ బంగారు నంది అవార్డులను సమాజ సేవకులకు ప్రదానం చేశారు. ఆదివారం రవీంద్రభారతి జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిక్కపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ విచ్చేశారు. హై 5 యూత్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గొట్రు నాగబాబు, గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ, ఏపీ స్టేట్ బోర్డ్ మెంబర్ బేతాళ దేవ సహాయం, మంది కొండలయ్య, జై భీమ్ యువజన సేవ సంఘం స్టేట్ కన్వీనర్ గుమ్మడి నాగరాజు అవార్డులు అందుకున్నారు.

నేడు అయ్యప్ప పుట్టిన రోజు

అంబర్‌పేట, మార్చి 24 : శ్రీహరిహర పుత్ర అయ్యప్ప స్వామి పుట్టిన రోజు వేడుకలు సోమవారం బాగ్‌అంబర్‌పేటలోని గురువాయూర్ శ్రీకృష్ణమందిర్‌లో నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి గురుస్వామి తెలిపారు.

సేవ్ లడఖ్

మెహిదీపట్నం జి.పుల్లారెడ్డి పాఠశాల గ్రౌండ్‌లో ఆదివారం క్రెమోచ్ మాంటిస్సోరి లైఫ్ పాఠశాల విద్యార్థులు సేవ్ లడఖ్ కార్యక్రమం నిర్వహించారు. మిస్టర్ సోనమ్ వాంగ్‌చుక్‌కి మద్దతుగా 19వ రోజు క్లైమేట్ ఫాస్ట్‌లో శాంతియుతంగా సమావేశాన్ని నిర్వహించారు.

– మెహిదీపట్నం, మార్చి 24

సత్వర పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలి

కాచిగూడ,మార్చి 24 : పీఎస్‌కు వచ్చే ఫిర్యాదులకు సత్వర పరిష్కారాన్ని పోలీసులు అందించాలని ఈస్ట్‌జోన్ డీసీపీ రావుల గిరిధర్ కోరారు. కాచిగూడ డివిజన్ ఏసీపీ వి.రఘు ఆధ్వర్యంలో ఈస్ట్‌జోన్ పరిధిలోని కాచిగూడ, నల్లకుంట, అంబర్‌పేట, సుల్తాన్ బజార్, ఉస్మానియా యునివర్సిటీ, వారాసిగూడ,అఫ్జల్‌గంజ్,చిలకలగూడ, లాలాగూడ, నారాయణగూడ, పది పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలతో యూఐ మేళా(అండర్ ఇన్వెస్టిగేషన్) కాచిగూడలో నిర్వహించారు. పెండింగ్ కేసులపై చర్చించారు. ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ పృథ్వీధర్‌రావు, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలు సమైక్యతకు నిలయాలు

కార్వాన్, మార్చి 24 : హోలీ నేపథ్యంలో జాఫర్‌గూడ, తుల్జా భవానీనగర్, న్యూ సత్యనారాయణ నగర్‌లో కార్వాన్ జన జాగరణ వేదిక ప్రతినిధులు వేడుకలు నిర్వహించారు. యువత,చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకున్నారు. కార్యక్రమంలో ముల్లె రాకేశ్, అనంతకృష్ణ, గోవర్ధన్, వంశీ, రాధాకృష్ణ, శ్యాంలింగం, రక్షిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవర కరుణాకర్ సేవలు మరువలేనివి..

కార్వాన్, మార్చి 24 : హైదరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత రాజకీయ పర్యటనలో భాగంగా ఆదివారం కార్వాన్ నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలను కలిశారు. గుడిమల్కాపూర్ దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. దేవర కరుణాకర్ సతీమణి, మాజీ కార్పొరేటర్ దేవర దీప, కుమారుడు దేవర వంశీలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో పూజలు

మెహిదీపట్నం : హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ ఎంపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. కార్యక్రమంలో లోక్‌సభ కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్,నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనఖీ

చిక్కడపల్లి, మార్చి 24 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చిక్కడపల్లి పీఎస్ పరిధిలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఆదివారం చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో బాగ్‌లింగంపల్లి, సుందరయ్య పార్కు ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు.

ఇంట్లో చొరబడి ఆభరణాల అపహరణ

మెహిదీపట్నం మార్చి 24 : హబీబ్‌నగర్ పీఎస్ పరిధిలో 15 తులాల బంగారు ఆభరణాలు,రెండున్నర లక్షల నగదు, 15 వేల రియాల్ చోరీకి గురైన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లి ఘటాలా మసీద్ సమీపంలో ఉండే అజర్ అహ్మద్ శనివారం రాత్రి నమాజ్‌కు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి హబీబ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతా నిద్రలో ఉండగా ఆగంతకుడు చోరీకి పాల్పడినట్లు గుర్తించామని, సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకుంటామని సీఐ రాంబాబు తెలిపారు.